క్లుప్తంగా

పరామర్శ



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, వార్డు సభ్యుడు ఊదరి మహేష్ తల్లి కళావతి అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, భూపాలపల్లి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మంగళవారం పరామర్శించి ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, నాయకులు కిష్టయ్య, శ్రావణ్, ఉన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

శాయంపేట : మండలంలోని పత్తిపాక, ప్రగతి సింగారం, వసంతపూర్, కొప్పుల, రాజుపల్లి, నేరేడుపల్లి గ్రామాల లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరు కానున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న ప్రగతి సింగారంలో క్లస్టర్ గ్రామాలకు మండల స్థాయి పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని బీఆర్‌కే గార్డెన్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సభ నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, బీఆర్‌ఎస్ సిరిసిల్ల ఇన్‌చార్జ్ బస్వరాజు సారయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొననున్నట్లు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఓర్వలేకే అనర్హత వేటు'

ఆత్మకూరు: జోడో యాత్రతో రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆయనపై మోదీ ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని కాంగ్రెస్ ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. తీన్మార్ మల్లన్నను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. సమావేశంలో ఓబీసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బయ్య తిరుపతి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, సొసైటీ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



దామెర: సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని ఊరుగొండలో సఖి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులు, గృహహింస, అత్యాచారాలకు గురైన మహిళలు వన్‌స్టాప్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేస్ వర్కర్లు వినీల, హరిత మాట్లాడారు. సఖి సంస్థ ద్వారా కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, న్యాయ సలహాలు, తాత్కాలిక వసతి వంటి పలు సేవలందిస్తామని అన్నారు. వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 181 లేదా 0870–2452112 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ సేవలు

పరకాల: స్థానిక బస్‌స్టేషన్ నుంచి నార్లాపూర్ మీదుగా జమ్మికుంటకు బుధవారం నుంచి ఆర్టీసీ బస్సులు నడుపాలని నిర్ణయించినట్లు పరకాల డిపో ఆర్టీసీ డీఎం కృష్ణమూర్తి తెలిపారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు నార్లాపూర్, వెంకటేశ్వర్లపల్లి, మరిపల్లి, మరిపల్లిగూడెం, మల్యాల, ఇల్లంతకుంట, జమ్మికుంట సర్వే చేయడం జరిగిందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీని గతంలో మాదిరిగానే ఆదరించాలని కోరారు.

దోషులను శిక్షించాలి

నడికూడ: ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీపై మంగళవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. దోషులు ఎంతటి వారైనా పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆరె సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, మండల అధ్యక్షుడు లోకెటి నగేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

నియోజకవర్గ ప్రజలపై ప్రేమతో నేత్రదానం

● ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ఐనవోలు : మూడోసారి వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గ ప్రజలపై ప్రేమతో నేత్రాలను దానం చేశానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. తాను మరణించిన తర్వాత కూడా తన కళ్లతో నియోజకవర్గ ప్రజలను చూడాలనే పిచ్చి ప్రేమే అందుకు కారణమని స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్‌లో ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న పలువురికి రీడింగ్ గ్లాసెస్ అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన 3 కోట్ల మందికి కేవలం 100 రోజుల్లో కంటి పరీక్షలు నిర్వహించి తెలంగాణ ప్రభుత్వం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నెలకొల్పబోతుందని స్పష్టం చేశారు. 58 రకాల వైద్య పరీక్షలు, 18 రకాల వ్యాధులకు సంబంధించిన చికిత్సలు అందించే ఆరోగ్య మహిళ అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్ గోకి రేణుక, ఎంపీటీసీ పిండి మాధవి, డాక్టర్లు ప్రణవి, సంతోష్, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.



దామెర: ముస్త్యాలపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శంకర్



ఎల్కతుర్తి: వల్భాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్వప్న

దామెర: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్‌అలీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, నాయకులు జన్ను మల్లయ్య, చిలువేరు రాజు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ప్రభుత్వం ప్రాతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మేకల స్వప్న, సర్పంచ్ సర్పంచ్ అంబాల మమత అన్నారు. మంగళవారం మండలంలోని వల్భాపూర్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ రహిత సమాజం కోసం కంటివెలుగు కార్యక్రమం చేపట్టిందన్నారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోడులు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ హెక్తేదార్ హైమ్మద్, ఉపసర్పంచ్ రామారావు, అంబాల ప్రతాప్, ఏఎన్‌ఎం మమత తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ధర్మసాగర్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘాలు ఏప్రిల్ 5న చేపట్టబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎస్ జిల్లా కోశాధికారి బొల్లం సాంబరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు ఆరూరి భాగ్య ఆధ్వర్యంలో మంగళవారం చలో ఢిల్లీ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను, కార్మికులను దెబ్బతీసే విధానాలను అవలంభిస్తుందని, వ్యవసాయ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందన్నారు. మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కుబేరుల చేతిలో పెట్టి ప్రభుత్వ సంస్థలైన సీసీఐ, కో ఆపరేటీవ్ వ్యవస్థలను వారికి కట్టబెట్టేందుకు ఎదురు చూస్తుందని విమర్శించారు. తెలంగాణలో రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులు రైతులను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు వారి సమస్యలపై గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాడి హక్కులను సాధించుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో నరహరి, భిక్షపతి, అనిత, స్వరూప, కుమార్, గట్టయ్య, అరుణ, కోమల తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు నైపుణ్య శిక్షణ



సర్పంచ్‌కు వివరాల పత్రిక అందజేస్తున్న అధికారి

ధర్మసాగర్(వేలేరు): తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ వారు లేబర్‌కార్డు కలిగిన 18 నుంచి 45 సంవత్సరాల భవన నిర్మాణ కార్మికులకు వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామంలో 15 రోజుల నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు, ఈ శిక్షణ ఈ నెల 31 నుంచి ప్రారంభం కానుందని ఎన్ఏసీ ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కాలంలో కార్మికులకు మధ్యాహ్న భోజనంతో పాటు రోజుకు రూ.300 చొప్పున 15 రోజులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని చింతల్‌తండా, మాటుతండా, బండతండా, ఎర్రబెల్లి గ్రామాల కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందాలనుకునే వారు 8106547340 గల నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి సర్పంచ్ గూడ కవిత రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ అల్లం సతీష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న సంపత్‌కుమార్

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేసి స్వచ్ఛ భారత్ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని ఎస్‌బీఎం ప్రతినిధి సంపత్‌కుమార్ అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వీఓఏలు, సర్పంచ్‌లకు మూడురోజుల శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం రెండోరోజు మండలంలోని హుస్సేన్‌పల్లిలో నిర్వహించారు. జీపీ కార్యాలయంలో గ్రామ శానిటేషన్‌పై సర్వే చేసి అనంతరం గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీఓ రంజిత్‌కుమార్, సర్పంచ్ గుండెకారి రజిత శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఎస్‌బీఎం ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో పండ్లు, పూల మొక్కలు పెంచాలి

కమలాపూర్: ప్రతి నర్సరీలో తప్పనిసరిగా మునగ, టకోమా, బొప్పాయి వంటి పండ్ల మొక్కలతో పాటు మూడు రకాల పూల మొక్కలు పెంచాలని ఎంపీడీఓ జి.పల్లవి సూచించారు. మండలంలోని భీంపల్లిలోని నర్సరీని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు ఆమె పలు సూచనలు చేశారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు సంబంధించి ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ జవ్వాజి పద్మకుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి జాన్సీ, ఏపీఓ రమేష్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

'పది' విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 60 మంది విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు మంగళవారం పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గత 15 ఏళ్లుగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేస్తున్నట్టు తెలిపాడు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గురువులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలి

ఆత్మకూరు: కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, అల్పకాలిక విస్తారక్ కన్నెబోయిన రాజయ్య యాదవ్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్, కొత్తగట్టు పోలింగ్ బూత్‌లలో మంగళవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. బీజేపీ కార్యకర్తలు బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పల్లెకు బస్సు సౌకర్యం

నడికూడ: మండలంలోని వెంకటేశ్వర్లపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దృష్టికి బస్సు సౌకర్యం విషయం తీసుకెళ్లగా ఆయన పరకాల ఆర్టీసీ డిపో డీఎం కృష్ణమూర్తికి బస్‌సర్వీస్ నడపాలని సూచించారు. మంగళవారం పరకాల నుంచి వయా చర్లపల్లి, నార్లపూర్, వెంకటేశ్వర్లపల్లె, మరిపెల్లిగూడెం, మల్యాల, ఇల్లంతకుంట, మీదుగా జమ్మికుంటకు రోజుకు 4 ట్రిప్పులు నడపడం జరుగుతుందని డీఎం తెలిపారు.

ఉచిత విద్య అందించాలి

కమలాపూర్: రాష్ట్రంలోని పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని ఉచిత విద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ డిమాండ్ చేశారు. పేదలందరికి ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరుతూ విద్య, వైద్యం సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర మంగళవారం కమలాపూర్ మండలంలోని ఉప్పల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గ్రామస్తులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉచిత విద్య, వైద్యం సాధన సమితి ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు సమిండ్ల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చు



దామెర: సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని ఎస్సై ముత్యం రాజేందర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ ద్వారా చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. సడన్ కార్డియాక్ అరెస్ట్ అయిన సమయంలో సీపీఆర్ ద్వారా ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించాలని సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల సీపీఆర్ చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో వైద్య, 108, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు



కమలాపూర్: పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎస్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తక రచయిత, ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ మతీన్ అహ్మద్ అన్నారు. పది విద్యార్థుల వార్షిక పరీక్షల సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కమలాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, తెలంగాణ మోడల్ స్కూల్, ఎంజేపీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఆయన వెంట డీఆర్పీ పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, ఎం.రఘుపతి, జనగాం డీఆర్పీ రామానుజం, ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు, కేజీబీవీ ఎస్వో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రతన్‌సింగ్ ఠాకూర్

నడికూడ : వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం మండల కేంద్రంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు వస్తువుల కొనుగోలు, ఇతర వినియోగదారులపై పర్యావరణ పై పడే ప్రభావం గురించి, వినియోగదారుల పరిరక్షణ చట్టంల పై సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండ కాళీదాస్(విజిలెన్స్ కమిటీ మెంబర్) చేరాల సర్వేశం, వేల్పుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలు వాడాలి

● ఎల్కతుర్తి ఎంపీపీ మేకల స్వప్న



కమలాపూర్ : గర్భిణులకు సీమంతం జరిపిస్తున్న సర్పంచ్ విజయ



దామెర: మాట్లాడుతున్న తహసీల్దార్ రియాజుద్దీన్

ఎల్కతుర్తి: మెరుగైన ఆరోగ్యం కోసం తల్లులు, గర్భిణులు రోజు తినే ఆహారంలో చిరుధాన్యాలను వాడాలని ఎంపీపీ మేకల స్వప్న, సీడీపీఓ స్వరూప సూచించారు. మంగళవారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమం చేపట్టి కిశోర బాలికలకు, తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకోవడంతో అనేక పోషక విలువలు అందుతాయన్నారు. ఆహార అలవాట్లు మార్చుకుంటే భవిష్యత్‌లో ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలని సమాజానికి అందించిన వారవుతారని అన్నారు. అనంతరం వైద్యుడు డాక్టర్ హెక్తేదార్ హైమ్మద్ విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి పల్లె అనితాదేవి, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ తేజశ్రీ, సూపర్‌వైజర్ పద్మావతి, శిరీష, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పుష్కలమైన పోషకాలు

దామెర: చిరుధాన్యాల్లో పుష్కలమైన పోషక విలువలు ఉంటాయని తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. రక్తహీనత ఉన్నవారు బెల్లంతో తయారు చేసిన పల్లీల ముద్దలు, నువ్వుల ముద్దలు, ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు తీసుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సైపర్‌వైజర్ జంగం రాణి, సర్పంచ్ శ్రీరాంరెడ్డి, వార్డు సభ్యులు వేల్పుల రాజ్‌కుమార్, సుమన్, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని సోమనపల్లి, రామకిష్టాపూర్(టి) గ్రామాలలో సర్పంచ్‌లు ఉద్దమారి మహేష్, గునిగంటి మహేందర్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తిరుమల, వనితలు మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా స్వర్ణ, ఉపాధ్యాయులు తిరుపతి, విద్యార్థులు, పాల్గొన్నారు.

కమలాపూర్: చిరుధాన్యాలతోనే మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని సర్పంచ్ కట్కూరి విజయ అన్నారు. భీమదేవరపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ స్వరూప అధ్యక్షతన కమలాపూర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జరిగిన మండల స్థాయి పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం 11 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమాల్లో ఏఓ జాలి లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయురాలు అంజనీదేవి, పీహెచ్‌ఎన్ దయామణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిరీష, రేణుక, అనిత, సుశీల, కల్పన, పోషణ్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ తేజ, శృతి, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఎదుట వ్యాపారాలు చేయొద్దు



చేపల వ్యాపారులతో మాట్లాడుతున్న డిపో మేనేజర్ కృష్ణమూర్తి

శాయంపేట : మండలకేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదుట చేపలు, మటన్ అమ్మకాలు చేపట్టవద్దని పరకాల ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణమూర్తి వ్యాపారస్తులను హెచ్చరించారు. మంగళవారం ట్రాఫిక్ సూపరిటెండెంట్ కృష్ణకుమారి, ఎస్‌డీఐ మోహిజొద్దీన్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా ప్రయాణ ప్రాంగణాన్ని సందర్శించి పరిశీలించారు. వ్యాపారస్తులు చేపలు అమ్ముతుండడంతో డీఎం వారితో మాట్లాడారు. గతంలో కూడా పలుమార్లు హెచ్చరించినప్పటికీ యథావిధిగా విక్రయిస్తుండడంతో ఆ వాసనతో ప్రయాణికులు ఎవరూ ఉండడం లేదన్నారు. దీంతో అక్కడే ఉన్న గ్రామస్తులు కలుగజేసుకొని బస్సు షెల్టర్ ముందు బస్సులు ఆగడం లేదని, బస్సు షెల్టర్‌లో ఉన్న మరుగుదొడ్ల దుర్గంధం వెదజల్లుతున్నాయన్నారు. గతంలో మైలారం, పత్తిపాక, గ్రామాలకు బస్సు సౌకర్యం ఉండేదని, హన్మకొండ నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేదని ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి చేపల వ్యాపారులను అక్కడి నుంచి తరలించారు.

సూర్యనాయక్‌తండాలో కార్డన్‌సెర్చ్



గుడుంబా స్థావరాలపై దాడులు చేసి ధ్వంసం చేసిన డ్రమ్ములు, సీజ్ చేసిన ద్విచక్రవాహనాలు

శాయంపేట : మండలంలోని సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం గ్రామాల్లో మంగళవారం పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, పరకాల ఎక్సైజ్ సీఐ జగన్నాధరావు ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గుడుంబా స్థావరాలపై దాడులు చేయగా 30 లీటర్ల నాటుసారా లభ్యం కాగా స్వాధీనం చేసుకొని అజ్మీర రామ్‌సింగ్, రాధ, భూక్య శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 450 లీటర్ల బెల్లంపానకం లభ్యం కావడంతో అక్కడే ధ్వంసం చేశారు. పత్రాలు లేని పది వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వాహన డాక్యుమెంట్స్ పరిశీలించి తర్వాత వాహన యాజమానులపై తగిన చర్య తీసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో శాయంపేట, పరకాల, దామెర, ఆత్మకూర్ ఎస్సైలు ఇమ్మడి వీరభద్రరావు, ప్రశాంత్, రాజేందర్, ప్రసాద్, ఎక్సైజ్ ఎస్సైలు ఎస్ పద్మ, పరకాల సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాం

ఐనవోలు: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించడానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ సిద్ధంగా ఉన్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాంనగర్, కక్కిరాలపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కక్కిరాలపల్లి నుంచి ప్రధానంగా జీపీ భవన నిర్మాణం, సీసీ రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుమతులు, స్వయంభూ లక్ష్మినరసింహస్వామి ఆలయానికి పాలకవర్గం ఏర్పాటు, ఆలయం, మసీదు, చర్చిలకు ప్రహరీల ఏర్పాటు, మహిళ సంఘం, అంగన్‌వాడీ కేంద్రాలకు బిల్డింగ్‌లు, వీటితో పాటు దళితులు ఎక్కువగా ఉన్నందున దళితబంధులో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కెనాల్ రోడ్డును అభివృద్ధి పరిస్తే వాహనాలన్నీ గ్రామానికి రాకుండా బైపాస్‌లో వెళ్తాయనే తదితర అంశాలను మండల పార్టీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి త్వరగా పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఉస్మాన్ అలీ, తంపుల మోహన్, టీ.చందర్‌రావు, ఎం.బాబు, బుర్ర రాజశేఖర్, మిద్దెపాక రవీందర్, వడిచర్ల శ్రీనివాస్, భాస్కర్, సురేష్, కొంరయ్య, అబ్బాసలి, రాఘవులు, దేవికారెడ్డి, నరేష్, అరుణ్‌కుమార్, సర్పంచ్‌లు కంజర్ల రమేష్, బోయినపల్లి శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ రమేష్, అనిల్, ఉప సర్పంచ్‌లు ప్రకాష్, సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి

దామెర: యువత సన్మార్గంలో పయనించాలని ఎస్సై ముత్యం రాజేందర్ అన్నారు. మండలంలోని దమ్మన్నపేట్‌లో మంగళవారం రాత్రి పోలీస్ జాగృతి కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా మూఢనమ్మకాలు, చెడు వ్యసనాలు, రోడ్డు భద్రతా నియమాలపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ పుల్యాల రాజిరఘుపతిరెడ్డి, జాగృతి కళాబృందం సభ్యులు నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్‌రాజు, నారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.